క్లుప్తంగా

నేలకొరిగిన విద్యుత్ స్తంభం



ఇల్లెందురూరల్: మండలంలోని ఇల్లెందు–గుండాల ప్రధాన రహదారిలో కొమరారం గ్రామ సమీపంలో బుధవారం ప్రమాదవశాత్తు రోడ్డు రోలర్ ఢీకొట్టడంతో విద్యుత్తు స్తంభం నేల కొరిగింది. ఆర్అండ్బీ శాఖ ఆధ్వర్యంలో బీటీ రోడ్డు మరమ్మతు పనులలో వినియోగిస్తున్న రోడ్డురోలర్కు అకస్మాత్తుగా బ్రేకులు మొరాయించడంతో సమీపంలోని స్తంభాన్ని నేరుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం బీటీ రోడ్డుపై వాలింది. అదే సమయంలో కొమరారంలో కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లిన ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సంఘటన వివరాలు తెలుసుకొని విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు.

మహిళలకు వడ్డీలేని రుణ బకాయిలు చెల్లింపు

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాల మహిళలకు రెండేళ్లకు సంబంధించిన వడ్డీలేని రుణ బకాయిల ప్రొసీడింగ్స్ను ఏపీఎం దుర్గారావు పంపిణీ చేశారు. సెర్ప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పొదుపు సంఘాలకు నాలుగేళ్లకు సంబంధించి వడ్డీలేని రుణాలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య కార్యదర్శి సౌజన్య, కోశాధికారి సుగుణ, సెర్ప్ ఉద్యోగులు రాంమ్మూర్తి, సంపత్, నర్సింహారావు, స్వర్ణలత, కొమ్మాలు, లాలయ్య, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాల్పోస్టర్ల ఆవిష్కరణ

జూలూరుపాడు: ఈనెల 10న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల సుబాష్ చంద్రబోస్ అలియాస్ రవన్న వర్ధంతి సభ వాల్పోస్టర్లను బుధవారం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. మండలాల సంయుక్త కార్యదర్శి బానోత్ ధర్మా, జవహర్లాల్, ఎం.కృష్ణయ్య, సుజాత, వీరు, సర్దార్, భూక్యా లోక్యా, తాటి నరసింహారావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ: కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నాగారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యడారి రాజేశ్(28) తన భార్యతో తరచు గొడవ పడుతుండేవాడు. పెద్ద మనుషుల మధ్య పంచాయతీ కూడా నిర్వహించారు. ఈ క్రమంలో భార్య రాధ పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపంతో రాజేశ్ బుధవారం పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. అయితే ఆసుపత్రి వద్ద సిబ్బంది సకాలంలో వైద్యం చేయలేదని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

యువతి అదృశ్యం

పాల్వంచ: యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని జగన్నాథపురంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిని వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఒక యువతి బుధవారం తెల్లవారుజాము నుండి కనిపించకుండా పోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన ధర్మసోతు శ్రీరాంపై అనుమానం ఉందని ఫిర్యాదు చేసాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్

సుజాతనగర్: మండలంలోని రాఘవాపురం గ్రామంలోని అంకమ్మ తల్లి దేవాలయంలో హుండీ పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన రాఘవాపురం గ్రామానికి చెందిన మరికంటి ఉపేందర్అనే వ్యక్తిని స్థానిక పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ఈ చోరీకి పాల్పడిన ఉపేందర్ గతంలో సత్తుపల్లి, చుంచుపల్లి మండలాల్లో జరిగిన ద్వి చక్రవాహనాల చోరీల కేసులో నిందితుడుగా ఉన్నట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు. అతడి నుండి రూ.1,800 నగదుతో పాటు రెండు బైక్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

సుజాతనగర్: మండల పరిధిలోని డేగలమడుగు గ్రామంలో జరుగుతున్న బాల్య వివాహ ప్రక్రియను చైల్డ్లైన్ టీం సభ్యులు బుధవారం అడ్డుకున్నారు. తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన ఓ పదిహేడేళ్ల బాలికకు డేగలమడుగు గ్రామంలోని తన అమ్మమ్మ,తాతయ్యలు వివాహం చేయాలని నిశ్చయించుకున్నారు. కాగా ఆ వివాహం గురువారం కొత్తగూడెంలో జరగనుండగా విషయం తెలుసుకున్న చైల్డ్లైన్ టీం సభ్యులు గ్రామానికి చేరుకొని పోలీసుల సాయంతో వివాహ ప్రక్రియను అడ్డుకున్నారు. అనంతరం ఇరు పక్షాలను పోలీస్స్టేషన్కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

చైతన్యమే మార్పునకు పునాది

ఘనంగా మహిళా దినోత్సవం

మహిళా చైతన్యమే సమాజ మార్పునకు పునాది అని పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. సేవలు అందజేస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పలు చోట్ల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళల గొప్పతనాన్ని కొనియాడారు.

– సాక్షి నెట్వర్క్



పాల్వంచ: కేటీపీఎస్లో సంబురాల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగినిలు



ఇల్లెందు: ఎమ్మెల్యే హరిప్రియను సత్కరిస్తున్న మెప్మా ఉద్యోగులు



ఇల్లెందు: కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్లు



టేకులపల్లి: టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేత..



జూలూరుపాడు: మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సోనీ, దిశ కమిటీ సభ్యులు



సుజాతనగర్: మహిళా కార్మికులకు సన్మానం..



కొత్తగూడెంఅర్బన్: 35వ వార్డులో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



సూపర్బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో..



పాల్వంచ: షీ టీం ఎస్సై రమాదేవిని సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు



సింగరేణి(కొత్తగూడెం): శుభాకాంక్షలు తెలుపుకుంటున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ చైల్డ్ ఉమెన్ ఎంపవర్మెంట్ సభ్యులు



ఇల్లెందురూరల్: సుభాష్నగర్లో..



కొత్తగూడెంఅర్బన్: ప్రియదర్శినీ కళాశాలలో..



పాల్వంచరూరల్: గురుకుల కళాశాలలో..

ఆరోగ్యవంతమైన సమాజానికి 'ఆరోగ్య మహిళ'



ఇల్లెందురూరల్: పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ' పథకం లక్ష్యమని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని కొమరారం పీహెచ్సీలో పథకాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యమహిళ పథకంలో భాగంగా ప్రతి మంగళవారం మహిళలకు ఎనిమిది ప్యాకేజీలుగా వైద్యసేవలను అందించి ఆందులో 57 పరీక్షలు ఉచితంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. దీనికి సంబందించి ఆసుపత్రి సిబ్బందికి ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. త్వరలోనే న్యూట్రిషన్ కిట్లను కూడా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనే విషయాన్ని ఆరోగ్య శాఖ మంత్రి హరీష్రావు ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి ఇంకా సమకూర్చాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. పలువురు రోగులను ప్రశ్నించి, ఆసుపత్రి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు నాళి కృష్ణవేణి, బానోత్ సంతు, మోకాళ్ల కృష్ణ, వాంకుడోత్ సరోజిని, రజిత, ఎంపీటీసీ ఆజ్మీర బిచ్చా, పీహెచ్సీ వైద్యాధికారిణి లోహిత, సిబ్బంది పాల్గొన్నారు.

చుంచుపల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా క్లినిక్ ద్వారా అందించే వైద్య సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చుంచుపల్లి ఎంపీడీఓ సకినాల రమేష్ అన్నారు. పెనగడప పీహెచ్సీలో ఆరోగ్య మహిళా క్లినిక్ను ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. పీహెచ్సీ డాక్టర్ నేహా అంబ్రిన్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, సర్పంచ్ మాలోత్ కళావతి, అంబేడ్కర్ నగర్ సర్పంచ్ మాలోత్ జగదాంబ, వైద్య సిబ్బంది పూర్ణ, రవి, ఆశలు, మహిళలు భారీగా పాల్గొన్నారు.



చుంచుపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్

పొదుపు సంఘాలకు రుణాల పంపిణీ

పాల్వంచరూరల్/పాల్వంచ: రాష్ట్రంలోని మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే స్వయం సంఘాల మహిళలకు రూ.4 కోట్ల వడ్డీలేని రుణాలను పంపిణీ చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులను ప్రధానంచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్. శ్రీకాంత్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బరపటివాసుదేవరావు, ఎంపీపీ మడివి సరస్వతి, సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎం.రాజ్గౌడ్, నాయకులు ఎస్వీ ఆర్కె.ఆచార్యులు, కిలారు నాగేశ్వరరావు, మహిపతి రామలింగం, మండలాధ్యక్షుడు మల్లెలశ్రీరామమూర్తి, పూసల విశ్వనాథం, కాల్వ ప్రకాశ్రావు, బండి చిన్న వెంకటేశ్వర్లు, నాగ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



రుణాల చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా రాకపోకలు



నిత్యం 24 గంటలు వాహన రాకపోకలతో రద్దీగా ఉండే బీసీఎం జాతీయ రహదారిపై ప్రమాదకర పరిస్థితిలో భక్తులు రాకపోకలను కొనసాగిస్తున్నారు. మండల పరిధిలోని జగన్నాథపురం, కేశవాపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ దర్శనానికి నిత్యం వేలాదిమంది తరలివస్తుంటారు. డివైడర్ను అసంపూర్తిగా నిర్మించడంతో వాహనాలు, భక్తులు ప్రమాదకర పరిస్థితిలో రాకపోకలను కొనసాగిస్తున్నారు. గతంలో ఇలా రోడ్డు దాటుతున్న క్రమంలో భక్తుడు మృత్యువాత పడ్డ ఘటన కూడా ఉంది. డివైడర్ మధ్యలో నుంచి రాకపోకలు సాగించకుండ మూసివేయాలని అనేక సార్లు అధికారులను కోరిన పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి డివైడర్ మధ్యలోని దారిని మూసివేసి భక్తులను ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

– పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : యుగేందర్, హైవే ఈఈ
సెల్ నంబర్ : 8333923755

రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ బచావో సదస్సు పోస్టర్లను బుధవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్లోని అమరవీరుల స్థూపం దగ్గర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యదర్శి మల్లెల రామనాథం మాట్లాడుతూ... మిలియన్ మార్చ్ స్ఫూర్తితో తెలంగాణ బచావో సదస్సును మార్చి 10న హైదరాబాద్లోని బాగ్లింగంపల్లి వీఎస్టీ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నామని దీనికి పెద్ద ఎత్తున ఉద్యమకారులు హాజరుకావాలన్నారు. రాష్ట్రంలో అణచివేత, అప్రజాస్వామిక పాలన సాగుతుందని విమర్శించారు. ఉద్యమకారుల ఆత్మబలి దానాలతో గద్దెనెక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల బతుకులను ఆగం చేసిందని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్య పరిష్కారం కాలేదన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, పోడు భూముల సమస్య, డబుల్ బెడ్ రూముల సమస్య, మూడెకరాల భూమి అందని ద్రాక్ష పండులా అయిందన్నారు. తెలంగాణ బచ్చావో సదస్సుకు పెద్ద ఎత్తున ఉద్యమకారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్కె.నబిసాహెబ్, ప్రధాన కార్యదర్శి కర్ణాకర్రెడ్డి, పంపన శివ ప్రసాద్, నాయకులు వల్లాల భరత్, అడ్వకేట్ ఆంజనేయులు రాము, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో హోలీ వేడుకలు



టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని తండాల్లో బుధవారం ఘనంగా హోలీ వేడుకలు జరుపుకున్నారు. చిన్నపెద్ద తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకుని ఆట పాటలతో సందడి చేశారు. కామదాహనం కార్యక్రమం నిర్వహించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇల్లెందురూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమరారం ఎస్సై శివరామకృష్ణ సూచించారు. మండలంలోని కొమరారం గ్రామంలో బుధవారం కొమరారం పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలియని వ్యక్తులకు బ్యాంక్ అకౌంట్ నంబర్లు తెలిపొద్దని, ఆధార్కార్డు ఇవ్వొద్దని సూచించారు. ఫోన్ చేసి బ్యాంక్ అకౌంట్కు ఆధార్ అనుసందానం చేయాలని, ఇతరత్రా కారణాలు చెప్పి బ్యాంకు ఖాతా వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుంటారని అలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు నాళి కృష్ణవేణి, బానోత్ సంతు, మోకాళ్ల కృష్ణ, ఎంపీటీసీ ఆజ్మీర బిచ్చా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివరామకృష్ణ

'మావోయిస్ట్ పార్టీ ప్రకటనను ఖండిస్తున్నాం'



మాట్లాడుతున్న సాబీర్పాషా

సింగరేణి(కొత్తగూడెం): భద్రాచలం ప్రాంతంలో వేలాది ఎకరాల సాగుభూములు పదుల సంఖ్యలో కాలనీలను నిర్మించి పేదలకు భూమిహక్కును సాధించిన చరిత్ర భారత కమ్యూనిస్ట్ పార్టీదని, వాస్తవాలను మావోయిస్ట్ పార్టీలు తెలుసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.సాబీర్పాషా అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా సహాయ కార్యదర్శి రావులపల్లి రాంప్రసాద్పై కొంతమంది ఇచ్చిన తప్పుడు సమాచారంతో మావోయిస్టు పార్టీ ప్రకటన చేయడాన్ని సీపీఐ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ప్రకటించారు. భద్రాచలం పట్టణంలో కొన్ని పట్టాభూముల్లో కొన్ని సంఘాల పేరుతో గుడిసెలు వేసుకున్నారని, హైకోర్టు ఉత్తర్యులతో గుడిసెలు చేయిస్తే, దానికి రాంప్రసాద్కానీ, సీపీఐ బాధ్యత కాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు గుత్తుల సత్యనారాయణ, నరాటి ప్రసాద్, వై. శ్రీనివాస్రెడ్డి, కంచర్ల జమలయ్య పాల్గొన్నారు.

సింగరేణి ప్రధానాస్పత్రిలో దొంగల బెడద

రోగుల ఆభరణాలకు, వస్తువులకు భద్రత కరువు

- ఇబ్బంది పడుతున్న కార్మిక కుటుంబాలు
- పట్టించుకోని ఆస్పత్రి ఉన్నతాధికారులు



సింగరేణి ప్రధానాస్పత్రి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ వెన్నెముకలా పనిచేస్తున్న ప్రధానాస్పత్రి దొంగలకు కేరాఫ్గా పనిచేస్తోందని కార్మిక కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. ఆస్పత్రి ఇన్వార్డ్లో చికిత్స పొందుతున్న రోగుల ఆభరణాలకు, వస్తువులకు రక్షణ లేకుండా పోయింది. గత రెండు నెలల్లో మూడుసార్లు దొంగతనాలు జరగడంతో కార్మిక కుటుంబాలు ఆస్పత్రిలో ఉండాలంటే భయందోళనకు గురవుతున్నారు. సింగరేణి సంస్థ కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటమే కాకుండా, అత్యధిక వేతనాలు చెల్లిస్తూ సింగరేణి విజిలెన్స్, ఇంటలిజెన్స్, సింగరేణి సెక్యూరిటి సిబ్బంది నియమించినప్పటికీ ఫలితం లేకుండా పోతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థ అన్నిరకాల సదుపాయాలను ఏర్పాటు చేసినా, సిబ్బంది ఉన్నా దొంగతనం చేసిన వారిని పట్టుకోకపోవటం శోచనీయం. అంతేకాకుండా ఆస్పత్రిలో కుక్కల సంచారం, నర్సింగ్ హాస్టల్లో కోతుల బెడదతో నర్సింగ్ విద్యార్థినులు బయటికి రాలేని పరిస్థితి. ఆస్పత్రిలో రోగుల సంఖ్య రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వారి వస్తువులకు భద్రత కరువవుతున్న క్రమంలో ఆస్పత్రిలో సెక్యూరిటీని పెంచాలని కార్మికులు కోరుతున్నారు. అంతేకాకుండా ఆస్పత్రిలో కుక్కల, కోతుల బెడదను నివారించాలని కార్మికులు, కార్మిక కుటుంబాల సభ్యులు కోరుతున్నారు.

సెక్యూరిటీని పెంచాలి



ఆస్పత్రిలో జరిగిన వరుస దొంగతనాలు జరిగాయి వాటిని అరికట్టేందుకు సెక్యూరిటీని పెంచాలని సీఎంఓకు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినా ఫలితం లేదు. అనారోగ్యంతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలకు ఆరోగ్యం పక్కన పెడితే వారి ఆభరణాలు, డబ్బులను దొంగలు ఎత్తుకెళ్తుండడంతో ఆస్పత్రికి వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు.

– వంగా వెంకట్, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

ప్రహరీ నిర్మాణం చేపట్టాలి



సింగరేణి సంస్థలో 24 గంటల పాటు ప్రైవేట్, పర్మనెంట్ సెక్యూరిటీలు ఉంటుండగా ఆస్పత్రి ఆవరణలోకి కుక్కలు ఎలా వస్తున్నాయో అర్థం కాని పరిస్థితి. కోట్ల రూపాయలతో ఆస్పత్రి, ప్రహరీ నిర్మాణం చేపట్టి కోతులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో కోతులు వచ్చి నర్సింగ్ విద్యార్థుల మీద దాడి చేస్తుంటే చర్యలు లేకపోవడం విచారకరం.

– పి.సతీష్, సీపీఐ(ఎంఎల్) పట్టణ కార్యదర్శి